

యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలి

రైతుసంఘం ఆధ్వర్యాన పాలగూడెంలో రైతుల ఆందోళన

ఏలూరు: తుపాను హెచ్చరికల నేపథ్యంలో కల్లాల్లోని ధాన్యం యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏలూరు రూరల్ మండలం పాలగూడెంలో సంఘం నాయకులు కల్లాల్లోని ధాన్యాన్ని బుధవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో ధాన్యాన్ని యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తుపాను వల్ల వర్షాలు కురిసి ధాన్యం తడిచిపోతే అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. రైతులకు గోనె సంచులు ఇవ్వాలని కోరారు. ధాన్యం రవాణాకు లారీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వెంటనే ఏర్పాటు చేసి ధాన్యం రవాణాకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.రాంబాబు, పి.పూర్ణచంద్రరావు, ఎం.నాగరాజు, ఎం.సాయి తదితరులు పాల్గొన్నారు.

కొన్నది సగం ధాన్యమే..!

రెండు జిల్లాల్లో దిగుబడులకు, కొనుగోలు లక్ష్యాలకు పొంతన కరువు

లక్ష్యం పూర్తయిందని కొన్ని మండలాలకు సంచులు నిలిపివేత

మండలాల్లో అధికారులను నిలదీస్తున్న రైతులు

మరోపక్క తుపాన్ హెచ్చరికలతో రైతుల గుండెల్లో గుబులు

ధాన్యం కొనేందుకు ముందుకు రాని మిల్లర్లు, వ్యాపారులు

కొనసాగుతున్న లారీల సమస్య

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ధాన్యం నూతన కొనుగోలు విధానంలో మిల్లర్లు, ధాన్యం వ్యాపారుల ప్రమేయం లేకుండా చేశాం. రైతులకు మేలు చేసేలా అన్ని చర్యలూ తీసుకున్నాం. ఇ-క్రాప్ పూర్తయిన ప్రతి ఎకరా ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది' అని నిన్నటి వరకూ ఊదరగొట్టారు. ఇప్పుడేమో నిర్దేశించిన లక్ష్యం వరకూ మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తామని, బహిరంగ మార్కెట్లో అమ్ముకోవాలని చెబుతున్న పరిస్థితి నెలకొంది. 'మీకిచ్చిన లక్ష్యం పూర్తయిందని, ఇక సంచులు ఇచ్చేది లేదని మండలాల్లోని అధికారులకు చెప్పడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జిల్లాలవ్యాప్తంగా వచ్చే వరి దిగుబడులకు.. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి ఏమాత్రం పొంతన లేదని స్పష్టమవుతోంది. ఒకపక్క వాతావరణ మార్పులు, మరోపక్క ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది.



ఖరీఫ్‌లో పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 1.99 లక్షల ఎకరాల్లో వరిసాగు సాగింది. ఐదు లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. అయితే ఇక్కడ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని నిర్దేశించుకున్న ధాన్యం లక్ష్యం 3.42 లక్షల టన్నులు మాత్రమే. ఏలూరు జిల్లాలో రెండు లక్షలకుపైగా ఎకరాల్లో వరిసాగు సాగింది. ఇక్కడ కూడా దాదాపు ఆరు లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి తీసుకున్న లక్ష్యం మాత్రం 3.80 లక్షల టన్నులు మాత్రమే. దీన్నిబట్టి చూస్తే పండిన పంటలో సగం ధాన్యం మాత్రమే కొనుగోలు చేసేలా లక్ష్యాలు కన్పిస్తున్నాయి. మిగిలిన ధాన్యం కొనుగోలు పరిస్థితి ఏమిటనే ప్రశ్నకు మాత్రం సరైన సమాధానం లేకుండాపోయింది. ఇప్పటికే ఇచ్చిన లక్ష్యానికి సరిపడా ధాన్యం కొనుగోలు చేశారని, ఇక సంచులు ఇవ్వడం కుదరదని పలు మండలాలకు చెబుతున్నట్లు తెలుస్తోంది. ధాన్యం కొనుగోలు చేయాలని మండలాల్లోని అధికారులను రైతులు చుట్టుముడుతుండటంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. మిల్లర్లు, వ్యాపారుల ప్రమేయం లేకుండా చేస్తానని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడేమో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయకపోవడం ఏమిటని అంతా తలలు పట్టుకుంటున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు రైతులను దోచుకునేందుకు సిద్ధమయ్యారు. ధాన్యం అమ్మకానికి వెళ్తే వ్యాపారులు, మిల్లర్లు ఇష్టమొచ్చిన ధరకు అడుగుతున్న పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. చాలాచోట్ల ధాన్యం కొనుగోలు చేసేందుకు మిల్లర్లు, వ్యాపారులు సైతం ముందుకు రాకపోవడంతో రైతులకు ఏం చేయాలో అర్థంకాని దుస్థితి నెలకొంది. మరోపక్క బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. అందుకు తగినట్లుగా వాతావరణంలో సైతం పెను మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మరోపక్క లక్ష్యం ప్రకారమే ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పడంతో రైతులకు ఏంచేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

తీరని లారీల సమస్య

ధాన్యం తరలింపునకు సంబంధించి లారీల సమస్య మాత్రం ఏలూరు జిల్లాలో రైతులను ఇంకా వెంటాడుతూనే ఉంది. ఇప్పటికీ పూర్తిస్థాయిలో వాహనాలు రావడం లేదు. ఆయా మండలాలకు రోజుకు 20 లారీలు అవసరముంటే కేవలం ఏడెనిమిది లారీలు మాత్రమే వస్తున్నాయి. దీంతో ధాన్యం తరలింపు మందకొడిగా సాగుతోంది. ధాన్యం కల్లాలోనే ఉండిపోవడంతో వాతావరణ హెచ్చరికలు రైతుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. లారీలు అధిక సంఖ్యలో వెళ్తే బస్తాల్లో పట్టిన ధాన్యం త్వరితగతిన పూర్తవుతోంది. చాలామంది రైతులు బస్తాల్లో ధాన్యం పట్టి ఐదురోజులపైనే ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది.



ఎర్రని తోరణాలతో ముస్తాబైన జంగారెడ్డిగూడెం పట్టణం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభకు

సర్వం సన్నద్ధం

నేడు భారీ ప్రదర్శన, బహిరంగ సభ

పాల్గొనున్న గిరిజనోద్యమ నేత బృందాకరత్, జాతీయ నేతలు

మండల, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జంగారెడ్డిగూడెంలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో మూడు రోజులపాటు జరగనున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభకు ఏజెన్సీ ముఖద్వారమైన జంగారెడ్డిగూడెంలో ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఈ మహాసభకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తయినట్లు మహాసభ ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.రవి తెలిపారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా విస్తృత ప్రచారం వివిధ రూపాల్లో నిర్వహించామన్నారు. తొలిరోజు నిర్వహించే ప్రదర్శన, బహిరంగ సభల్లో వేలాది మంది వ్యవసాయ కార్మికులు, పేదలు, గిరిజనులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం రెండు రోజులపాటు జరిగే ప్రతినిధుల సభకు 350 మంది ప్రతినిధులు, 50 మంది ఆహ్వానితులు మొత్తం 400 మంది హాజరుకానున్నారని చెప్పారు. బహిరంగ సభలో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు ఎ.విజయరాఘవన్, ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, కేరళ ఎంపీ శివదావన్, రైతుసంఘం మాజీరాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, పిడిఎఫ్ ఎంఎల్‌సిలు షేక్ సాబ్జీ, ఐ.వెంకటేశ్వరరావు పాల్గొంటారని వివరించారు.




బృందాకరత్

నాటి నుంచి నేటి వరకూ

ఉద్యమ స్ఫూర్తితో ముమ్మందుకు..

భూపోరాటాలు, కూలి, ఉపాధి ఉద్యమాలకు వేదికగా వ్యవసాయ కార్మిక సంఘం





వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పడిన నాటినుండి కూలి, భూమి, ఇళ్ల స్థలాల సమస్యలపై సుందరయ్య స్థాపించిన సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పేదలకు పంచాల్సిన 16 రకాల ప్రభుత్వ భూములపై పెద్దఎత్తున ఉద్యమాలు నడిచాయి. పేదల పక్షాన కార్మికుల హక్కుల కోసం కూలి పోరాటాల నిర్మాణంలో వ్యవసాయ కార్మిక సంఘం కృషి ఎనలేనిది. ఇళ్ల స్థలాల కోసం, కూలి పోరాటాల సందర్భంగా అనేకమంది కూలీలు, పేదలు జైలుకు వెళ్లిన సందర్భాలూ ఈ జిల్లాలో ఉన్నాయి. వ్యవసాయ కార్మిక సంఘం ప్రారంభం నాటి నుండి నేటికీ అంచెలంచెలుగా ఎదుగుతూ ఈ జిల్లాలో 50 వేల సభ్యత్వాన్ని పూర్తిచేసుకుని నేడు 29వ రాష్ట్ర మహాసభ నిర్వహణకు వేదికైంది. ఇప్పటికే జంగారెడ్డిగూడెం పట్టణం ముస్తాబైంది. భూపోరాటాల గడ్డ, ఆదివాసీల హక్కుల కోసం నిరంతరం పోరాటపటిమ చూపిన జంగారెడ్డిగూడెం నేడు వ్యవసాయ కూలీల సభకు సిద్ధమైంది.

ఇప్పటికే సంఘం ఆధ్వర్యాన జిల్లాలో భూమి, కూలి, ఉపాధి, సామాజిక అంశాలపై ఉద్యమాలు సాగుతున్నాయి. షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న పోలవరం, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో ఎల్‌టిఆర్ భూముల కోసం గత 25 ఏళ్లుగా ఎత్తిన జెండా దించకుండా ఎర్రజెండా ఆధ్వర్యంలో భూపోరాటాలను సాగిస్తోంది. 20 వేల ఎకరాలను పేదలకు పంచిన చరిత్ర వ్యవసాయ కార్మిక సంఘానికి ఉంది. టి.నర్సాపురం మండలంలో పోడు భూముల కోసం సంఘం పోరాడుతుంది. ఆదివాసీ బిడ్డలను చైతన్యపర్చి, సమీకరించి అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో భూమి కోసం పోరాడుతుంది. ఇప్పటికే ఆ ప్రాంతంలో వందల ఎకరాల భూముల్లో పోడు కొట్టి ఆదివాసీ బిడ్డలు వ్యవసాయం సాగిస్తున్నారు. కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల్లో గత 15 ఏళ్ల నుండి పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపై ఆందోళన, ఉద్యమాలను సాగిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను తిప్పికొట్టేందుకు కృషి చేస్తోంది. జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం మండలాల్లో ఎర్రకాల్వ రిజర్వాయర్ మిగులు భూములు 3500 ఎకరాలను పేదలకు పంచాలని పెద్దఎత్తున ఆందోళన పోరాటాలను ఐదేళ్ల నుండి సంఘం ఆధ్వర్యంలో సాగిస్తోంది. ఈ జిల్లాలో రైతు, వ్యవసాయ కార్మిక ఉద్యమాల నిర్మాతలైన ఉద్దరాజు రామం, అన్నే వెంకటేశ్వరరావు, అన్నే అనసూయమ్మ స్ఫూర్తితో ఈ మహాసభ నిర్వహించబోతున్నాం. సీలింగ్ భూముల కోసం దెందులూరు తదితర మండలాల్లో పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తున్నాం. ఇళ్ల స్థలాల సమస్యపై పెదవేగి, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో పోరాటం చేసి వందలాది కుటుంబాలకు గుడిసెలు వేయించిన చరిత్ర వ్యవసాయ కార్మికసంఘానికి ఉంది. కూలీ పోరాటాల్లో భూస్వాములకు వ్యతిరేకంగా కూలీలందరినీ ఐక్యం చేసి సుదీర్ఘకాలం పోరాటాలు నడిపిన జంగారెడ్డిగూడెం, పెదవేగి, తాళ్లపూడి తదితర మండలాల్లో సామాజిక ఉద్యమాలను కూడా ముందుకు తీసుకెళ్తోంది. 12 మండలాల్లో పామాయిల్ కార్మికుల సమస్యలపై పోరాడుతూ వారి హక్కుల కోసం ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలని కోరుతూ జిల్లా నుండి రాష్ట్రస్థాయి వరకు నిర్విరామంగా పోరాడుతున్న సంఘం వ్యవసాయ కార్మిక సంఘం. ఇంతటి ప్రాధాన్యత కలిగిన వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభను కుంజా బుజ్జి, సున్నం రాజయ్య తదితరులు స్ఫూర్తితో జంగారెడ్డిగూడెం పట్టణంలో నిర్వహించబోతున్నాం.

-ఎ.రవి, రాష్ట్ర కార్యదర్శి
ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

నాడు పీడితుల అడ్డా.. నేడు పోరాటాల గడ్డ

కూలి కోసం కాలినడకన ప్రచార యాత్రలు - తొలి ప్రయత్నంలోనే రెట్టింపు కూలి సాధన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం రూరల్

అది సుమారు 1992వ సంవత్సరం. రోజంతా కష్టించి పని చేయడం తప్ప.. చేసిన కష్టానికి ఫలితం అడగలేని రోజులవి. కనీసం కష్టానికి తగ్గ ఫలితం అడగాలనే ధైర్యం కూడా లేని రోజులవి. రోజంతా రెక్కలు ముక్కలు చేసుకున్నా డొక్క నిండని కాలమది. పెత్తందార్ల కబంధ హస్తాల్లో నలిగిపోతున్న కూలీల చీకటి బతుకులకు వ్యవసాయ కార్మిక సంఘం వేగుచుక్కలా కన్పించింది. పల్లె పల్లెలో సంఘం నేతలు కూలి ప్రచారం నిర్వహించి కూలీలను ఏకం చేశారు. కూలి చట్టంపై ప్రచార నిర్వహించారు. ఫలితంగా కూలీలు చైతన్యవంతులై వ్యవసాయకార్మిక సంఘం వెంట రాగా సాగిన పోరాటాలు మంచి ఫలితాన్నిచ్చాయి. నాలుగు రూపాయలు ఉన్న రోజు కూలిని ఒక్కసారిగా ఎనిమిది రూపాయలకు పెరగడం కూలీల కళ్లల్లో ఆనందాన్ని నింపింది. పీడితుల అడ్డాగా ఉన్న ఏజెన్సీ ముఖద్వారమైన జంగారెడ్డిగూడెం పోరాటాల అడ్డాగా మారింది.

కూలి పోరాటాల చైతన్యంతో జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, పోలవరం, జంగారెడ్డిగూడెం మండలాల్లో భూపోరాటాలు ప్రారంభమయ్యాయి. సెంటు భూమి లేని దళితులు, వ్యవసాయ కార్మికులు, ఆదివాసీలు నేడు జీవనోపాధికి సరిపడా సాగు భూమిని సాధించుకున్నారు. వేలాది కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయి. అది వ్యవసాయ కార్మిక సంఘం నేతృత్వాన సాగిన పోరాటాల ఫలితం అనడంలో ఎటువంటి సందేహమూ లేదు. మన్నెంలో నాడు ప్రారంభమైన కూలి పోరాటం క్రమంగా భూపోరాటంగా మారింది. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 1992లో జీలుగుమిల్లి మండలంలో ప్రారంభమైన కూలి పోరాటాలు విజయవంతం కావడంతో ఏకకాలంలో బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల్లో కూలి ప్రచారం నిర్వహించింది. ఆయా మండలాల్లోని 42 పంచాయతీల్లో రెండు బృందాలు 25 మంది కార్యకర్తలు ప్రతి గ్రామం కాలినడకన వెళ్లి కూలి ప్రచారం నిర్వహించారు. కూలీల్లో కూలి చట్టంపై అవగాహన కల్పించి తహాశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. అయినా ఫలితం లేకపోవడంతో పోరాటాలకు దిగారు. కూలీల పోరాటం అటు భూస్వాములను, ఇటు అధికారులను కదిలించింది. చర్చల ద్వారా నాలుగు రూపాయలు ఉన్న రోజు కూలిని ఒకేసారి 8 రూపాయలు చేశారు. దీంతో కష్టజీవులు వ్యవసాయ కార్మిక సంఘాన్ని అక్కున చేర్చుకున్నారు. ఆ పోరాటాల కొనసాగింపుగా 1996లో ఏజెన్సీ భూపోరాటానికి నాంది పలికింది. వేలాది గిరిజన కుటుంబాల్లో వేగుచుక్కలా నిలిచింది. వందల గిరిజన కుటుంబాలకు సాగు భూమిని పంచింది. వ్యవసాయ కార్మిక, గిరిజన, దళిత కుటుంబాల్లో వ్యవసాయ కార్మిక సంఘం చిరస్థాయిగా నిలిచిపోయింది.

కూలి పోరాటం చైతన్యం నింపింది
ఎన్.లక్ష్మీనారాయణ, జీలుగుమిల్లి


పోరాటం అంటే ఏమిటో తెలియని రోజుల్లో వ్యవసాయ కార్మిక సంఘం కూలి పోరాటం నిర్వహించాలని పిలుపునిచ్చింది. చట్టంపై ప్రచారం నిర్వహించింది. సంఘం పిలుపుతో చేపట్టిన పోరాటం కూలీల్లో చైతన్యం నింపింది. ఆ పోరాటం జీవితంలో మరిచిపోలేనిదిగా నిలిచిపోయింది. 30 సంవత్సరాల తర్వాత కూడా ఇప్పుడు గ్రామాల్లో ఉన్న కూలి సంఘం నాయకులుగా పిలుసుంటే ఆనందంగా ఉంటుంది.

ఆ పోరాటం రోజులు మరువలేను
కృపారావు, బుట్టాయగూడెం

గ్రామాల్లో రవాణా సౌకర్యం లేని రోజుల్లో కాలి నడకన వెళ్లి కూలీల కష్టాలు తెలుసుకున్నాం. సైకిళ్లు కూడా లేకుండా కాలినడకన వెళ్లాల్సి రావడంతో కొంత కోపం, ఇబ్బంది అన్పించినా కూలీల కష్టాలు విన్నాక తాము పడ్డ కష్టం పెద్దది కాదన్పించింది. జంగారెడ్డిగూడెం మండలం కట్టపదలవారిగూడెంలో కూలి కోసం చెబుతుంటే విచిత్రంగా చూశారు. కొన్ని గ్రామాల్లో ఆదరించారు. ఆ తీపి గుర్తులు నేను జీవితంలో మర్చిపోలేను. అది వ్యవసాయ కార్మిక సంఘం ద్వారానే నాకు సాధ్యమైంది.

కూలి సంఘం నన్ను నాయకుడిని చేసింది
నేలటూరి అప్పారావు, జీలుగుమిల్లి

జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం మండలాల్లో నిర్వహించిన కూలి పోరాటాలు నన్ను నేడు నాయకుడిగా తయారు చేశాయి. ఆనాడు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో తెలుసుకున్న కూలీల బాధలు మనస్సును కదిలించాయి. పగటిపూట కూలి పోరాటం చేయడం రాత్రి గ్రామంలోనే నివాసం ఉండి వారిలో చైతన్యం నింపడం నాయకత్వానికి పునాది వేసింది. వారికోసం పని చేయాలని నిర్ణయానికి తీసుకొచ్చాయి. ఫలితంగానే నేడు ప్రజల కోసం పని చేస్తున్నాను.



పతాక నిధికి విరాళాల సేకరణను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

సైనికుల సేవ వెలకట్ట లేనిది : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

దేశ రక్షణ కోసం అహర్నిశలు విశిష్టసేవలందిస్తున్న సాయుధ దళాల త్యాగనిరతిని ప్రతిఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని సాయుధ దళాల పతాక దినోత్సవంలో భాగంగా జిల్లా సైనిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పతాక నిధికి విరాళాల సేకరణను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం నిధికి విరాళం అందించారు. పతాక నిధి ఫ్లాగ్‌ను ఎన్‌సిసి విద్యార్థులు కలెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో సైనికులకు, మాజీ సైనికులకు, వారి కుటుంబ సభ్యులకు సాయుధ దళాల పతాక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భారత సైనిక దళాలు దీక్షతో చూపిన దేశభక్తి, సాహసం, త్యాగాల పట్ల దేశం గర్విస్తుందన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో సైనికుల ధైర్య సాహసాలు, తెగువకు, జాతియావత్తు గర్విస్తుందన్నారు. ప్రతిపౌరుడు సంఘీభావంగా పాల్గొని త్రిసాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి విరాళం అందించాలని కోరారు. జిల్లాలోని విద్యార్థులు, వ్యాపారవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, ప్రజల సహకారంతో గత ఏడాది అధిక నిధులు సేకరించి అగ్రస్థానంలో జిల్లా నిలిచిందన్నారు. అదే స్ఫూర్తి కొనసాగించి పతాక దినోత్సవ నిధికి స్వచ్ఛందంగా విరాళాలు ఇవ్వడం ద్వారా దేశసేవలో అమరులైన వారికి, గాయపడిన సైనికులకు, వారి కుటుంబాలకు మనమంతా కృతజ్ఞత చాటుదామన్నారు. మనం అందించే విరాళాలను డైరెక్టర్, సైనిక వెల్ఫేర్, విజయవాడ పేరున, స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా ఖాతా - 33881128795, ఐఎఫ్ఎస్‌సి కోడ్ ఎస్‌బిఐఎన్ 0016857కు ఆన్‌లైన్ ద్వారా చెల్లించి జమచేసిన వివరాలను ఏలూరు జిల్లా సైనిక సంక్షేమ అధికారి వాట్సప్ నెంబర్ 9177094013కు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి ప్రసాదరావు, సిబ్బంది నవాబ్‌జాన్, శ్రీనివాసులరెడ్డి, బడేటి శ్రీనివాస్, సుధాకర్, ఎక్స్ సార్జెంట్, శ్రీధర్, సర్‌సిఆర్ రెడ్డి కళాశాల ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

భూహక్కు పత్రాల పంపిణీ పూర్తి చేయాలి

తహాశీల్దార్లకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు

రీసర్వే పూర్తి చేసిన గ్రామాల్లో భూహక్కు పత్రాల పంపిణీని వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తహాశీల్దార్లను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు హాలులో జిల్లా అధికారులతో కలిసి రీసర్వే, జగనన్న ఇళ్లు, స్వచ్ఛ గ్రామాలు, జగనన్న పాల వెల్లువ తదితర కార్యక్రమాలపై మండలస్థాయి అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మూడు ఫేజ్‌ల్లో 81 గ్రామాల్లో జగనన్న భూహక్కు, భూరక్షా కార్యక్రమం కింద భూముల రీసర్వే కార్యక్రమం జరిగిందని, దీనికి సంబంధించి 24,500 భూహక్కు పత్రాలకుగాను, తొమ్మిది వేల భూహక్కు పత్రాలను ఇకెవైసి అనంతరం పంపిణీకి సిద్ధం చేశామని, వీటిని వెంటనే సంబంధిత భూయజమానులకు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మిగిలిన భూహక్కు పత్రాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఇకెవైసి పూర్తి చేసి, వాటి పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న ఇళ్ల పథకం కింద ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. జూన్ వరకు నిర్మాణ పనులకు అనుకూల సమయమని, ఇళ్ల నిర్మాణ పనులు త్వరిగగతిన పూర్తిచేసేలా లబ్ధిదారులతో మాట్లాడాలని అన్నారు.

సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునే వారికి ఇల్లు మంజూరు చేసి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇంకా పనులు పూర్తి కాకపోవడంపై అధికారులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసుకోవడానికి మూడు నెలల సమయం ఇచ్చి, అప్పటికీ వారి నుండి స్పందన లేకపోతే, ఇళ్ల మంజూరు ఉత్తర్వులను రద్దు చేస్తామని తెలియజేస్తూ నోటీసులు జారీ చేయాలన్నారు. జగనన్న ఇళ్ల కాలనీలకు సంబంధించి కోర్టులో ఉన్న కేసులు, సమస్యాత్మక స్థలాల విషయంలో ప్రత్యామ్నాయ భూములను గుర్తించి, సోమవారంలోగా ప్రతిపాదనలను సంబంధిత తహాశీల్దార్, ఆర్‌డిఒలు ధ్రువీకరించి పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. స్వచ్ఛ గ్రామాల కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ విధానం జిల్లా అంతటా తప్పనిసరిగా అమలు కావాలన్నారు. లింగపాలెం మండలంలో జగనన్న పాల వెల్లువ ప్రారంభం సందర్భంగా గుర్తించిన పాల సేకరణ కేంద్రాలకు పూర్తి స్థాయిలో కంప్యూటర్లు, పాల సేకరణ యంత్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, డిపిఒ మల్లికార్జునరావు, గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్, వ్యవసాయశాఖ జెడి వై.రామకృష్ణ, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, సాంఘిక సంక్షేమ శాఖ జెడి మధుసూదనరావు, జిల్లా సహకార శాఖాధికారి ప్రవీణ, డ్వామా పీడీ రాంబాబు, డిఎంహెచ్ఒ డాక్టర్ రవి, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎవిఆర్.మోహన్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ట్రాన్స్‌కో ఎస్ఇలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ్‌కు ప్రజల భాగస్వామ్యం ఉండాలి

ఏలూరు: గ్రామాల స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ్-2023కు సంబంధించి గ్రామాల్లో చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో జిల్లాకు సంబంధించిన ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, డేటా ఆపరేటర్లతో స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ్ 2023 జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమం జెడ్‌పి సిఇఒ కెఆర్.రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ్ 2023 సంబంధించి ప్రణాళికను అధికారులు రూపొందించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ ర్యాంకింగ్స్‌ను ఇస్తామని చెప్పారు. జిల్లాలో మండలానికి రెండు మోడల్ గ్రామాలు చొప్పున స్వచ్ఛ సర్వేక్షణ్ ఎంపిక చేసుకుని ఆ గ్రామాన్ని క్లీన్ అండ్ గ్రీన్ గా తయారు చేయాలని సూచించారు. ఈ పథకంలో వినూత్న విధానాల ద్వారా ప్రజలను ఆకర్షించి, స్వచ్ఛతపై అవగాహన కల్పించి వారిని భాగస్వాములను చేయాలన్నారు. మండలంలో రెండు గ్రామాలను నూరుశాతం స్వచ్ఛతను సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమం ఆరు నెలలు నిర్వహిస్తామని, విడతలవారీగా జిల్లాలోని 56 గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛ సర్వేక్షణ పూర్తిచేయాలని తెలిపారు. మండలంలో రెండు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని తాను, జెసి పి.అరుణ్‌బాబు కలిసి తనిఖీలు చేస్తామని, మిగిలిన గ్రామాల్లో జిల్లాపరిషత్ సిఇఒ ఆధ్వర్యంలో తనిఖీలుంటాయని తెలిపారు. ఎంపిక చేసిన గ్రామాల్లో నూరుశాతం స్వచ్ఛత చేపట్టాలన్నారు. గ్రామాధికారులు స్వచ్ఛత యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుని కార్యక్రమాల సమాచారాన్ని వారు ప్రమోట్ చేయాలని చెప్పారు. పారిశుధ్యం కార్యక్రమంలో స్కూలు విద్యార్థులను ఉపయోగించరాదన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కెఆర్.రవికుమార్, డిపిఒ మల్లికార్జునరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఎంవివి సత్యనారాయణ, ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, డేటా ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబరుపేటలో డెంగీ కేసు

అధికారులు అప్రమత్తం

భీమడోలు: మండలంలోని అంబరుపేటలో డెంగీ కేసు అధికారికంగా నమోదు కావడంతో వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తమయ్యారు. పూళ్ల పిహెచ్‌సి డాక్టర్ లీలా ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి. అంబరుపేటకు చెందిన వ్యక్తి గత రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. ఆయన చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి వెళ్లడంతో పరీక్షించిన వైద్యులు డెంగీగా నిర్ధారించారు. ప్రస్తుతం అతను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో వైద్య సిబ్బంది గ్రామంలో శానిటేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సుమారు వంద మందికి వైద్య పరీక్షలు చేశారు. 82 మంది వివిధ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. డెంగీ పరీక్షను ఆరుగురికి చేశారు. వీరి రిపోర్టులు రావాల్సి ఉంది. ఈ సందర్భంగా పిహెచ్‌సి ఎంపిహెచ్ఇఒ కిషోర్ మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరం ఇప్పటి వరకూ మూడు డెంగీ కేసులు నమోదయ్యాయన్నారు. బాధితులకు వైద్యసేవలందిస్తున్నామన్నారు.

చింతలపూడిలో సబ్ కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో సబ్‌కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ బుధవారం పర్యటించారు. మల్లయ్యగూడెం రైస్ మిల్లు వద్ద రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. గోనె సంచుల సమస్యను వివరించడంతో పరిష్కరిస్తామని తెలిపారు. రైతులను ఇబ్బంది పెట్టొద్దని సిబ్బందికి సూచించారు.

జిల్లా రిసోర్స్‌పర్సన్ కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు

ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (APFPS) పరిధిలో జిల్లా రిసోర్స్ పర్సన్ (డిఆర్‌పి)గా ఇన్సెంటివ్ పద్ధతిలో పని చేయడానికి ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఏలూరు జిల్లా ఎపిఎఫ్‌పిఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.పాండురంగ ఓ ప్రకటనలో తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో డిగ్రీ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఇస్తామని, అగ్రికల్చర్, హార్టికల్చర్, ఎంబిఎ లేక ఏ ఇతర డిగ్రీ అయిన పూర్తి చేసిన వారు అర్హులన్నారు. డిగ్రీతో పాటు బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఎల్‌ఐసి, మార్కెటింగ్, స్వచ్ఛంద సంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థల్లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఈ మేరకు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఆహార పరిశ్రమల ఏర్పాటు కోసం ఔత్సాహికులకు అవగాహన కల్పించడం, బ్యాంకు లింకేజి చేయించడం, వారి ఆహార పరిశ్రమల స్థాపనకు జిల్లా రిసోర్స్ పర్సన్ పనిచేయాల్సి ఉంటుందన్నారు. జిల్లా రిసోర్స్ పర్సన్ రెమ్యునరేషన్ ఇన్సెంటివ్ పద్ధతిలో మాత్రమే ప్రయోజనం కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాను పోస్టు ద్వారా గాని, ఈ మెయిల్ edwg.apfps@gmail.comకు పంపించాలని తెలిపారు. వివరాలకు (7995086771) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎపిఎఫ్‌పిఎస్, ఉద్యాన శాఖ కార్యాలయంలో సంప్రదించావచ్చని తెలిపారు.


ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజనం కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికులను గుర్తించాలి


ప్రజాశక్తి - గణపవరం

మధ్యాహ్నం భోజన కార్మికులను ప్రభుత్వం గుర్తించాలని, ప్రతినెలా ఐదో తేదీనాటికి వేతనాలు చెల్లించాలని సిఐటియు మండల కార్యదర్శి పి.గోవిందు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిఐటియు మండల అధ్యక్షులు ఎం.పెంటా రావు అధ్యక్షత వహించారు. మండల కార్యదర్శి ఎస్తేరు రాణి, గోవిందు మాట్లాడుతూ కార్మికుల పట్ల ప్రభుత్వ వైఖరి దారుణమన్నారు. మెనూ ఛార్జీలు ఒక్కో విద్యార్థికి రూ.20 చెల్లించాలన్నారు. కార్మికులకు యూనిఫారాలు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం ఎంఇఒ పి.శేషుకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమ ంలో కె.వరలక్ష్మి, పంజా శేషవేణి, జి.అలివేలు, అల్లు కనకదుర్గ, పాల అశ్విని, బి.పార్వతి పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగర ప్రజలకు అసౌకర్యం కలగకుండా పరిశుభ్ర వాతావరణం కల్పించేందుకు పారిశుధ్య నిర్వహణపై సంబంధిత సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ షాహిద్ పేర్కొన్నారు. స్థానిక పత్తేబాద ప్రాంతాల్లో బుధవారం పారిశుధ్య నిర్వహణ పనులను కమిషనర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ షాహిద్ మాట్లాడుతూ డ్రెయినేజీ వ్యవస్థ, మురుగునీరు పారుదల సమస్యలపై సంబంధిత పారిశుధ్య సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. డ్రెయినేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు కలవకుండా ఆయా నివాస ప్రాంతాల్లో చెత్తను ఎప్పటికప్పుడు తరలించి పారిశుధ్య నిర్వహణ పనులు నిర్వహించాలన్నారు. సిబ్బందికి కేటాయించిన ప్రాంతాల్లో సక్రమంగా విధులు నిర్వర్తించాలని, రోడ్లపై చెత్త వేయకుండా స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఇంటింటికి చెత్త సేకరణ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుని స్వచ్ఛ నగరాభివృద్ధికి కృషి చేయాలని, పారిశుధ్య సిబ్బందికి కమిషనర్ షాహిద్ తెలిపారు. అనంతరం ఐదో సర్కిల్ శానిటేషన్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బట్టు ఏడుకొండలు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్

ధాన్యం కొనుగోలు కేంద్రంలో తహశీల్దార్ తనిఖీలు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని పోలవరం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహశీల్దార్ సిహెచ్.విశ్వనాథరావు బుధవారం పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని రైతులందరూ ఉపయోగించుకొని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం దగ్గరకు తీసుకువచ్చి అమ్ముకోవచ్చని రైతుల ఖాతాలకు సకాలంలో ప్రభుత్వం డబ్బులు జమ చేస్తుందని చెప్పారు. అనంతరం పోలవరం గ్రామానికి ప్రభుత్వం పెట్రోల్ బంకు మంజూరు చేయగా దాని నిర్మాణానికి పోలవరం నుంచి మంకొల్లు వెళ్లే రహదారి పక్కన స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు చెలికాని బాబ్జి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రెవెన్యూ కార్యదర్శి శేషు కుమారి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'టిడిపిని అధికారంలోకి తీసుకురావాలి'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రాష్ట్రంలో సైకో పాలన పోయి సైకిల్ పాలన రావాలని టిడిపి మహిళ రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగిరెడ్ల మేఘలాదేవి అన్నారు. కొయ్యల గూడెంలో టిడిపి మహిళ నేతల ఆధ్వర్యంలో తలపెట్టిన మాటామంతి కార్యక్రమం పోస్టర్‌ను మేఘలాదేవి, టిడిపి మహిళ విభాగం నేతలు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపడుతు న్నామ న్నారు. ఈ సందర్భంగా మేఘలాదేవి మాట్లాడుతూ జగన్‌ను నమ్మి ఓటేసి మహిళా వర్గం మోసపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళ నేతలు చెరుకూరి రమ్య, కాకి లక్ష్మి, లావణ్య, రొక్కం లక్ష్మి, సావిత్రి, కుమారి, కరుణ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

తాపడం తయారీకి వెండి విరాళం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సింగ రాయ పాలెం శ్రీసుబ్రహ్మణ్యేశ్వర దేవస్థానంలో అంతరాలయ ముఖద్వారమునకు వెండి తాపడం తయారీకి దాత బుధవారం వెండిని విరాళంగా అందించారు. హైదరాబాద్‌కు చెందిన మజ్జి సురేంద్ర, దుర్గామాధవి దంపతులు అంతరాలయ ముఖద్వారమునకు వెండి తాపడం తయారీ నిమిత్తం 557 గ్రాముల వెండిని బుధవారం ఆలయ ఛైర్మన్ శొంఠి నాగరాజు, ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్యకు అందించారు.

బిసిలపై దాడులు దారుణం : జనసేన

ప్రజాశక్తి - ఉంగుటూరు

పుంగనూరు నియోజకవర్గ బిసి నాయకులపై దాడులు చేయడం దారుణమని, నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని జనసేన పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ నాయకులు డిమాండ్ చేశారు. ఉంగుటూరు జనసేన నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. పుంగనూరు జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బోడె రామచంద్ర యాదవ్ ఇంటిపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. జనసేన పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి అధికార పార్టీ ఆందోళన చెందుతోందన్నారు. కులాల వారీగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. బిసిలపై దాడులు జరిగితే నాయకులుగా చలామణి అవుతున్న ఆర్.కృష్ణయ్య, అనిల్‌కుమార్ యాదవ్‌లు ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు.

పేదలకు సాగు పత్రాలు మంజూరు చేయాలి : వ్యకాస


టి.నరసాపురంలో...


కలిదిండిలో...

ప్రజాశక్తి - టి.నరసాపురం

పోడు సాగు చేస్తున్న పేదలకు పట్టాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఏజెన్సీ పోరాటాలకు ముఖద్వారమైన జంగారెడ్డిగూడెంలో ఈ నెల 8, 9 ,10 తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని అల్లూరి సీతారామరాజు నగర్, టి.నరసాపురం, ప్రకాష్‌నగర్, మల్లప్పగూడెం, బచ్చులేటిగూడెం, సాలిగూడెం, రామమ్మగూడెం, అబ్బుల్లాపురం గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం జెండాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఎనిమిదో తేదీన 12 గంటలకు జంగారెడ్డిగూడెం మార్కెట్ యార్డు వద్ద నుంచి బస్టాండ్ పక్కన ఉన్న మైదానం వరకు ర్యాలీ ప్రదర్శన కార్యక్రమం ఉంటుందని, అనంతరం జరిగే బహిరంగ సభకు మాజీ ఎంపీ, ఉపాధి హామీ రూపకల్పన చేసిన బృందాకరత్, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్ష కార్యదర్శులు విజయ రాఘవన్, రాష్ట్ర నాయకుల ు వెంకట్, రాష్ట్ర నలుమూలల నుంచి నాయకులు హాజరవుతారన్నారు. పదివేల మంది వ్యవసాయ కూలీలు, చిన్న సన్నకారు రైతులు పెద్ద ఎత్తున హాజరవుతున్నారు. ఈ మహాసభకు మండలంలోని వ్యవసాయ కూలీలు ప్రజలు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మడకం సుధారాణి, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు అనుమలు మురళి, మహిళా సంఘం మండల కార్యదర్శి మడకం కుమారి, గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పుసం చిన్నసూర్యరావు, ఎర్ర కాలువ మిగులు భూములు పోరాట కమిటీ నాయకులు బుద్దుల దుర్గమ్మ పాల్గొన్నారు.

చాట్రాయి : ఎనిమిదో తేదీ నుంచి జంగారెడ్డిగూడెంలో నిర్వహించే వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభలో వ్యవసాయ కార్మికులు, కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం పిలుపునిచ్చారు. బుధవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ కూలి పెంచండి, భూమి పంచండి అనే నినాదంతో రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని, ప్రతి వ్యవసాయ కూలీ ఈ మహాసభలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభకు మాజీ ఎంపీ బృందాకారత్, కేరళ రాష్ట్ర మంత్రి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొంటారని తెలిపారు.

కలిదిండి : ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి పదో తేదీ వరకు జంగారెడ్డిగూడెంలో నిర్వహించే వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని పెదలంక, మూలలంక, భాస్కరరావుపేట, పడమటిపాలెం, సానారుద్రవరం, కోరుకొల్లు గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం జెండా ఆవిష్కరణలు చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళరావు, మండల కార్యదర్శి జక్కుల మహేష్, మండల కమిటీ సభ్యులు పెరుమాల రమేష్, గోసంగి వినోద్, చీకటి సత్యనారాయణ, వీరవల్లి భాస్కరరావు, కుడిపూడి శ్రీనివాసరావు, గద్దె అనిల్, బుస్సా రామనాగేంద్రం, జోగి ఏసు, పంతగాని ప్రకాష్, ముంగం సురేష్, శేఖర్, అనిత పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ సమగ్రంగా చేపట్టాలి

కమిషనర్ షేక్ షాహిద్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్‌లలో ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు క్షేత్రస్థాయిలో బిఎల్‌ఒలు, సూపర్‌వైజర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారు లను కమిషనర్ షాహిద్ ఆదేశించారు. ఓటర్ల జాబితా నవీకరణపై బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ షాహిద్ మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన ప్రతిఒక్కరికీ ఓటు నమోదు పత్రాలు అందించి ఓటర్‌గా నమోదయ్యేలా బిఎల్‌ఒలు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి వివరాలు ఉన్నాయో లేదో సరిచూసుకొని తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీకి సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. జాబితాలో క్లెయిమ్స్, అభ్యంతరాల కింద ఫారం 6, 7 ద్వారా అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఓటర్ కార్డుతో ఆధార్ అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేసి పంపిణీ అవ్వని ఫొటో ఓటు గుర్తింపు కార్డులను వెంట నే పంపిణీ చేసేలా బిఎల్‌ఒలు చర్యలు తీసుకోవాలని కమిషనర్ షాహిద్ సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, బిఎల్‌ఒలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ షేక్ షాహిద్

కాలపరిమితి దాటిన పాలప్యాకెట్లను సరఫరా చేస్తే జైలుశిక్ష

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కాల పరిధి దాటిన పాల ప్యాకెట్లను వినియోగ దారులకు సరఫరా చేస్తే డెయిరీ ఫారంతోపాటు స్థానికంగా పంపిణీ చేసే డిస్ట్రిబ్యూటర్స్ కూడా వినియోగదారుల చట్టం పరిధిలోకి వస్తారని ఏలూరు జిల్లా వినియోగ దారుల కమిష న్ అధ్యక్షులు డి.కోదండరామ్ ఓ ప్రకటనలో తెలిపారు. కాలపరిధి దాటిన పాల ప్యాకెట్లను వినియోగదారు లకు సర ఫరా చేస్తున్నట్లు వినియోగదారుల ఫోరం దృష్టికి వచ్చిందన్నారు. పాలు విరిగినప్పటికీ పన్నీరుగా మారడం మనకు తెలిసిందే అయినప్పటికీ ప్రస్తుతం విరిగిన పాలు పన్నీరుగా కాకుండా విషపదార్థంగా మారుతున్నట్లు ఫోరం దృష్టికి వచ్చిందన్నారు. ఇటువంటి నేరాలకు జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందని చెప్పారు. వినియోగదారుల ంతా ఈ విషయాన్ని గమనించి వినియోగదారుల ఫోరం దృష్టికి తీసుకువస్తే తగిన చర్యల తీసుకుంటామని, 08812-237670, 08812-237460 ఫోన్ చేసి తమను సంప్రదించవచ్చని తెలిపారు.

వైసిపి పాలనలో బిసిలకు అన్యాయం

కలెక్టర్‌కు టిడిపి నేతల వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర జనాభాలో 50 శాతంపైగా జనాభా ఉన్న బిసిలకు మూడున్నరేళ్లుగా తీవ్రమైన అన్యాయం జరిగిందని ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి బిసి సెల్ అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస చక్రవర్తి ఆరోపించారు. పార్టీ బిసి సెల్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు నేతలు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేతివృత్తులు, కుల వృత్తులు చేసుకుంటూ జీవనం పొందే బిసిల అభివృద్ధి కుంటుపడిందని ఆవేదనవ్యక్తంచేశారు. సబ్‌ప్లాన్ నిధుల నుండి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల వరకూ ప్రతీ అంశంలో నిరాదరణకు, దగాకు గురవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యల కారణంగా ఆర్థిక, సామాజిక, రాజకీయంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా ఒరూపాయి కూడా ఖర్చు చేయలేదని పేర్కొన్నా, పైగా కార్పొరేషన్, సబ్‌ప్లాన్ నిధులను మళ్లించి బిసిలకు అన్యాయం చేశారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో తీవ్రమైన అన్యాయానికి గురవుతున్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రద్దు చేసిన పది శాతం రిజర్వేషన్ల పునరుద్ధరణకు శాసనసభలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. షరతుల్లేకుండా విదేశీ విద్య పథకాన్ని కొనసాగించాలన్నారు. ప్రభుత్వ సలహాదారులు, వైస్‌ఛాన్సలర్లలో 34 శాతం బిసిలకు ఇవ్వాలని, చేనేతలకు సబ్సిడీ పథకాలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర పథకాలకు రాష్ట్ర వాటా నిధులివ్వాలని, మత్స్యకారులకు సబ్సిడీపై వలలు, పడవల పంపిణీ పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ఏలూరు జిల్లా కార్యాలయ కార్యదర్శి పాలి ప్రసాద్, నాయకులు ఉప్పాల జగదీష్‌బాబు, బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు వీరంకి త్రినాధ్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పెనుబోయిన మహేష్‌యాదవ్, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, శీలం వెంకటేశ్వరరావు, వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉంగుటూరు: ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా కాగుపాడులో టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. సమస్యలపై పోరాటం చేద్దామని, గ్రామ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కడియాల రవిశంకర్, తెలుగు యువత ఆర్గనైజేషన్ సెక్రటరీ పొట్ల రాము, కాగుపాడు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న టిడిపి నేతలు

కొల్లేరు పరిరక్షణకు పోరాడేవారిపై అక్రమ కేసులు

టిడిపి నేత సైదు గోవర్ధన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొల్లేరు ప్రాంతంలో జరుగుతున్న అక్రమ తవ్వకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు, ఉన్నతాధికారులకు సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదు చేస్తున్నానని తనపై ఫారెస్టు అధికారులు, కొంతమంది వ్యక్తులతో చేతులు కలిపి కుట్రలు పన్నుతూ అక్రమంగా పీడీ యాక్ట్ కేసును బనాయించేందుకు ప్రయత్నిస్తున్నారని కొల్లేరు ప్రాంత టిడిపి నేత సైదు గోవర్ధన్ ఆరోపించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ కొల్లేరు అభయారణ్యంలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని సోషల్ మీడియా ద్వారా పలుమార్లు జిల్లా అధికారులకు, ఫారెస్టు అధికారులకు, ప్రజలకు, ప్రజా ప్రతి నిధులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాననే ఉద్దేశంతో ఫారెస్టు ఇన్‌ఛార్జి రేంజర్, మరికొంతమంది అధికారులతో కలిసి తనపై గతంలో ఉన్న ఫారెస్టు అధికారులు పెట్టిన కేసులను ఆసరాగా చేసుకొని నోరు నొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇకపై జరిగే అక్రమ తవ్వకాలను ప్రశ్నించకుండా ఉండేందుకు పీడీ యాక్ట్ ద్వారా తప్పుడు కేసులు పెట్టి తనను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు కొల్లేరు అభయారణ్య ప్రాంతంలో అనేకచోట్ల అక్రమ చెరువుల తవ్వకాలు జరిగాయని, వాటిపై ఇప్పటివరకు ఫారెస్టు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలే దని చెప్పారు. ఫారెస్టు అధికారులు అక్రమ సంపాదనకు అడ్డు తగలకుండా ఉండేందుకు తరపై పీడీ యాక్ట్ ద్వారా చర్యలు తీసుకుంటామని బెదిరిస్తున్నారన్నారు. ఈ విధంగా వ్యవహరిస్తూ, అక్రమార్జనకు అలవాటు పడిన ఫారెస్టు అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకొని కొల్లేరు అభయారణ్యాన్ని పరిరక్షించాలని కోరారు.

'టిడిపిని అధికారంలోకి తీసుకురావాలి'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రాష్ట్రంలో సైకో పాలన పోయి సైకిల్ పాలన రావాలని టిడిపి మహిళ రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగిరెడ్ల మేఘలాదేవి అన్నారు. కొయ్యల గూడెంలో టిడిపి మహిళ నేతల ఆధ్వర్యంలో తలపెట్టిన మాటామంతి కార్యక్రమం పోస్టర్‌ను మేఘలాదేవి, టిడిపి మహిళ విభాగం నేతలు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపడుతు న్నామ న్నారు. ఈ సందర్భంగా మేఘలాదేవి మాట్లాడుతూ జగన్‌ను నమ్మి ఓటేసి మహిళా వర్గం మోసపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళ నేతలు చెరుకూరి రమ్య, కాకి లక్ష్మి, లావణ్య, రొక్కం లక్ష్మి, సావిత్రి, కుమారి, కరుణ, నాగలక్ష్మి పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న వక్తలు

రాష్ట్రస్థాయి పోటీలకు పోలవరం విద్యార్థులు

ప్రజాశక్తి - చాట్రాయి

ఈ నెల ఐదో తేదీన ఎస్‌జిఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ స్టేడియం గుడివాడలో నిర్వహించిన అండర్ 14, 17 బాలుర విభాగంలో సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలవరం విద్యార్థులు రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మందపాటి కేశవరెడ్డి తెలిపారు. అండర్ 14 విభాగంలో సాఫ్ట్‌బాల్ క్రీడలో ఎనిమిదో తరగతి విద్యార్థి అమెర్ల సందీప్, బేస్‌బాల్‌లో పామర్తి నికిత్, అండర్ 17 సాఫ్ట్‌బాల్‌లో పదో తరగతి విద్యార్థి మొండ్రు హర్ష, బేస్‌బాల్‌లో దివ్వెల బాబి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక య్యారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఎస్.సుబ్బారావును, వ్యాయామ ఉపాధ్యాయుడుని, విద్యార్థులను గ్రామ పెద్దలు పిఎసిఎస్ అధ్యక్షులు చెలికాని బాబ్జి, ఎస్ఎంసి ఛైర్మన్ పోరంకి విజయ్‌కుమార్‌రాజు, ఎస్ఎంసి మాజీ ఛైర్మన్ వాళ్ల రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మందపాటి కేశవరెడ్డి, స్టాఫ్ సెక్రటరీ పాకాల రత్తయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు


పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక తంగెళ్లమూడిలోని సెంట్ విన్సెంట్ డి పాల్ పునరావస కేంద్రంలోని 26 మంది పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించామని రెడ్ క్రాస్ జిల్లా ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఇద్దరు పిల్లలను రిఫరల్ చేశామని, మరో ఇద్దరు పిల్లలకు కళ్లజోళ్లు అవసరం కాగా వాటిని ఉచితంగా తామే అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ మేరీ, రెడ్ క్రాస్ కో- ఆర్డినేటర్లు వి.నాగరాజు, కె.శ్రీనివాస్, ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి రిప్కా, హరీష్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చింతలవల్లి గ్రామంలో ప్రజలకు ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఎం.శేఖర్‌బాబు, ఎం.తిరుపతికుమార్, వి.రమేష్, వై.రాము, వై.తిరుపతిరావు, ఎం.సాయి ఈ కార్యక్రమంలో పాల్గొని ఎయిడ్స్ ఎలా వస్తుందో వివిధ కళారూపాల్లో ప్రజలకు వివరించారు.


రోడ్డు ప్రమాదంలో గాయపడిన తండ్రీ కొడుకులు మృతి

కుటుంబాన్ని ఆదుకోవాలని రోడ్డుపై స్థానికుల బైఠాయింపు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గురవాయిరాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో మంగళవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన తండ్రీ కొడుకులు గంటా వెంకన్న (44), గంటా తేజా (14) వైద్యం పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు.


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు మండలంలోని పుట్లగట్లగూడెంలో జంగారెడ్డిగూడెం - ఏలూరు రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఇరువురి మృతదేహాలను రోడ్డుపై ఉంచి స్థానికులు ఆందోళన చేపట్టారు. మృతుల కుటుంబానికి ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని, రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.


రోడ్డుపై బైఠాయించిన స్థానికులు

మర్రిగూడెంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని మర్రిగూడెంలో వైసిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర నాయకులు కురసం నిరీక్షణరావు, స్థానిక యూత్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచి సోయం బిందు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏలూరు ఆశ్రమం వైద్య బృందం పలురకాల గుండె, ఊపిరితిత్తులు, బిపి, సుగర్ వంటి అనారోగ్య బాధితులు 128 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 28 మందికి ఆపరేషన్లు అవసరం అవుతాయని వారికి ఆరోగ్యశ్రీపై ఉచితంగా ఏలూరు ఆశ్రమం ఆసుపత్రిలో చికిత్స నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు అనారోగ్య బాధితులకు దోహదపడతాయన్నారు. పేదలు ఈ ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని సర్పంచి సోయం బిందు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మహాసభకు తరలిన బిసి నేతలు

జయహో సభకు తరలిన బిసి నేతలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

వైసిపి ఆధ్వర్యంలో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన జయహో బిసి మహాసభకు ముదినేపల్లి మండలం నుంచి బిసి నేతలు బుధవారం బస్సులు, వివిధ వాహనాల్లో భారీగా తరలివెళ్లారు. ముదినేపల్లి సెంటర్‌లో ఎంఎల్ఎ తనయులు ఆదివినయ్‌కుమార్, వీరశ్యామ్‌ఫణికుమార్ బస్సులు, కార్ల ర్యాలీను జెండి ఊపి ప్రారంభించారు.